# కమలం(కా) పరం

ఆఫీసునుండి అప్పుడే వచ్చిన కమల, అప్పలమ్మ ప్రొద్దున వేసిన అంట్లు తోమలేదని గ్రహించి అక్కడేవున్న చెంబుని కొప్పడేసింది.

ఇంతలో ఇంటిముందు శంఖనాదం వినేటప్పటికి విసుక్కుంటూ — ఫో, ఫో, చెయ్యి కాళీలేదు, వేళాపాళా లేదు. అందితలుపు తీయడమే తడవుగా కానీ ఆమాటలేం లెక్కచేయకుండా ఆ జంగందేవర లోపలికి తోసుకువచ్చాడు. కమలకు ఏంచెయ్యాలో తోచటం లేదు. నోటివెంబడి మాటరావడం లేదు. కాలేజీలో డెజనుమంది విద్యార్థులకు బుద్ధి చెప్పిన కాలేజీ ఛాంపియన్ కమల—బయటకు ఫో అన్నమాట మాత్రం అనగలింది వణుకుతున్న కంఠంతో.

జంగం దేవర, ఒక్కసారి మీసం దువ్వి భయంకరంగా మళ్ళీ శంఖం వూదాడు.

కమలకు వాళ్ళనాయనమ్మ గుర్తొచ్చింది. వెంటనే లోపలికివెళ్ళి, ఒక చేత్తో మండుతున్న కొరివి, రెండో చేత్తో చీపురుకట్ట, తెచ్చి రెంటిని చూపిస్తూ ఫోతావా, పోవా అంది. జంగందేవర జోలెలోంచి కెమెరా తీసి ఫ్లాష్‌తో సహా క్లిక్ మనిపించాడు.

అలసించిన ఆశాభంగం, అనుకుని రెంటినీ విసిరింది కమల జంగందేవర మీదకు.

కాని జంగందేవర తప్పుకున్నాడు.

అప్పలమ్మా అని కేకేసింది కమల అప్పలమ్మలేదని మరిచిపోయి.

ఒక్కసారి గట్టిగా శంఖం వూది, మీసాలు, తలపాగా తీసి. "భద్రకాళీ ప్రసన్న" అన్నాడా వ్యక్తి.

ఛీ. ఛీ. ఏం మనుషులు మళ్ళీ చదివేవి పెద్ద చదువులైనా కొస్తవైనా మానవత్వంచూపరు అంటూ లోపలికి వెళ్లిపోయింది కమల.

కమలకు కోపం వచ్చిందనే నిదర్శనంగా దారిలో భీమడోలు ఆవుమూతి కూజా పగిలింది.

పరమేశం హతాశుడై పోయాడు.

తనకు బహుమతిగా వచ్చిన కప్పును ఒక చేత్తో పట్టుకుని రెండో చేత్తో కమల కొంగు పట్టుకుని కమ్మా.. కమలా...కమలాదేవి గారూ అంటూ ఆమెవెంబడి పడ్డాడు.

కమల సీరియస్‌గా ఒక్క చూపు చూసి బాత్ రూము లోపలికి వెళ్ళిపోయింది.

హా చంద్ర...మతిపోయిందిఅని అక్కడే ఉన్న పీటమీద చతికిలపడ్డాడు పరమేశం.

కమల ధుమధుమలాడుతూ వచ్చి, జూదంలో ఓడిపోయిన ధర్మరాజు పోజు పెట్టిన పరమేశాన్ని చూచి పొయ్యిలో నీళ్లు పోసింది. పరమేశం చలించలేదు.

ఆమె కొంతసేపటికి బయటకు వెళ్ళిపోయింది.

పరమేశం లేచి తన గదిలోకి వెళ్ళి బటలు తీసేసి పంచె కట్టుకుని, లాల్చీ వేసుకుని, తలుపుకు తాళంవేసి, హోటలులో భోజనంచేసి సినిమాకు వెళ్ళి రాత్రి 10 గంటలకు వచ్చి పడుకున్నాడు.

మరుచటిరోజు ప్రొద్దున పది గంటలకు భోజనాలవద్ద కమలమ్మ కసికొద్దీ కాకరకాయ కూర వండినా పరమేశం మాట్లాడకుండా భోజనం సాగించాడు. అతను చెయి కడుక్కునేసరికి కమల ఆఫీసుకు వెళ్ళిపోయింది....

## కోకా శ్రీ సుధ

(హైదరాబాదు)

...సాయంత్రం పరమేశం కాలేజీనుంచి వచ్చేసరికి కమల బెజవాడ వెళ్ళిపోయింది.

వారంరోజులు పోయిన తర్వాత బెజవాడలో నున్న కమల, పరమేశం వ్రాసిన "భార్య లేకుండా వుంటే ఆనందం" అన్న వ్యాసం ఒక వారపత్రికలో చదివి తన ప్రయాణం ఇంకోవారం వాయిదా వేసింది. ఆ మరుచటి రోజు పరమేశం దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది.

కమలా, ఇక్కడ భూకంపం, తుఫాను, అన్నీ ఒక్కసారే వచ్చాయా అనిపిస్తున్నది. మా మేనత్తట! ఇద్దరు కుమార్తెలు ముగ్గురు అబ్బాయిలు, ఒక పనివాడు, ఒక బొచ్చు కుక్క, ఒక కోతి (ఆవిడగారి చిన్నమ్మాయి) ఆవిడ భర్త, పిఠాపురంనుంచి ఇక్కడ దిగుమతి అయ్యారు. వారు రావడంవల్ల పరలోకానికి వెళ్ళిన వస్తువులు.

(1) మన రేడియో (వాళ్ళ పెద్దబ్బాయి ధర్మం) (2) నీ వానిటీబాగ్ (వాళ్ళ పెద్దమ్మాయిధర్మం) (3) నీ టాయిలెట్ సామాను (మిగతా వాళ్ళ ధర్మం) (4) అద్దం (కోతి ఉరఫ్ చిన్నమ్మాయి ధర్మం) (5) నీ చెప్పులు రెండు జతలు, నా చెప్పులు మూడు జతలు (బొచ్చుకుక్కగారి ధర్మం) (6) బియ్యం, చింతపండు, ఉప్పు పప్పువగయిరా॥ (అందరి ధర్మం) (7) నా సైకిల్‌స్టాండు (ఇది ఎవరి ధర్మమో కనిపెట్టడానికి ఒక డిటెక్టివ్‌ని నియమించుదామనుకుంటున్నా) (8) సేవింగ్స్ బ్యాంకి ఎకౌంటు (ఆవిడ భర్తగారి ధర్మం) ఇవన్నీ నాతో చెప్పకుండా పరలోకానికి ప్రయాణం కట్టాయి.

వీళ్ళు కనీసం రెండు నెలలైనా ఉంటారని నా అనుమానం. నీ అభిప్రాయంకూడా తెలియచెయ్యి.

ఉంటా
నీ పరం.

తా॥ కలం॥ వాళ్ల పనివాడు అప్పలమ్మను ఏదో అన్నాడంట. అది అట్లకాడ తిరగేసింది.

ఈ ఉత్తరం చదవగానే కమలమ్మ కంగారుపడి పుట్టింట రెండు పచ్చకాగితాలు అడిగి పుచ్చుకుని, టెలిగ్రాం కొట్టి—అల వైకుంఠపురిలో...అన్నట్లుగా విశాఖపట్టణములో వాలింది.

వెంకట్రావు స్టేషనుకు రాలేదు. ఆవిడ తిన్నగా ఇంటికొచ్చి చూచేసరికి ఇంటి తలుపులు బార్లా తీసివున్నాయి.

పరమేశం పేకాడుతున్నాడు కిశోర్ వెంకట్రావులతో కలిసి. కమల లోపలకు రావడం చూచి వాళ్ళిద్దరూ జారుకున్నారు.

పరమేశం, నేను గెలిచానురోయ్, అని గట్టిగా కేక వేయబోయేసరికి కమల లోపలికి వచ్చింది.

కమలవేపు చూసి చిరునవ్వు నవ్వాడు అదోలా పరమేశం.

కమల చూపుచూసి నవ్వు మానేశాడు పరమేశం.

హా చంద్రమతీ అన్నాడు పరమేశం; ఆ తరవాత. ★